సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం, 5, ఏప్రిల్, 2023



హారన్ మోత
నెల్లూరు నగరంలో శబ్ద కాలుష్యం పెరుగుతోంది. కొందరు వాహనం ఎక్కగానే అవసరం ఉన్నా లేకున్నా హారన్ కొడుతూ ఇతర వాహనదారులను ఇబ్బంది పెడుతున్నారు.
8లో..



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,750
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,516
3 శాతం జీఎస్టీతో	రూ.5,681
నవర (8 గ్రా)	రూ.45,448

వాతావరణం
గరిష్టం/కనిష్టం
36.3 /27.2

మంగళవారం గాలిలో 65 శాతం తేమ ఉంది. బుధవారం వాతావరణంలో ఎలాంటి మార్పులు ఉండవని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.




వెంకటాచలం: ఆసరా మూడో విడతకు సంబంధించిన నమూనా చెక్కును మహిళలకు అందజేస్తున్న మంత్రి కాకాణి


కావలి: నమూనా చెక్కు అందజేస్తున్న రాజ్యసభ్య సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి


నెల్లూరు: సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్


నెల్లూరు రూరల్ పరిధిలోని లబ్ధిదారులకు మెగా చెక్కు ఇస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

అవినీతికి తావు లేకుండా పథకాల అమలు

వెంకటాచలం: రాజకీయ ప్రమేయం లేకుండా, అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. వెంకటాచలం మండలంలోని ఎర్రగుంట వద్ద ఉన్న కమ్యూనిటీ హాల్లో మంగళవారం జరిగిన సంబరాల్లో ఆయన పాల్గొని లబ్ధిదారులకు మెగా నమూనా చెక్కును అందజేశారు. స్వయం సహాయక మహిళలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి, తద్వారా వారు పొందుతున్న లాభాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో మంత్రి మాట్లాడుతూ పేద మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నట్లు చెప్పారు. గత చంద్రబాబు పాలనలో మహిళలు, రైతులకు రుణ మాఫీ చేస్తానని నమ్మించి మోసం చేశారని గుర్తుచేశారు. పేదరికం వల్ల ఏ కుటుంబం ఇబ్బంది పడకూడదని ఆసరా, చేయూత, అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, వాహన మిత్ర, ఈబీసీ నేస్తం వంటి పథకాలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని తెలియజేశారు. మహిళలకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఆయా కుటుంబాలు ఆర్థికంగా మెరుగుపడేలా చేస్తున్నారన్నారు. జిల్లాలోని 34,440 గ్రూపులకు రూ.826 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించి 4,056 గ్రూపులకు రూ.91.83 కోట్లు కాగా అందులో వెంకటాచలం మండలానికి 826 గ్రూపులకు రూ.6.28 కోట్లు విడుదల చేశారన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఎంపీడీఓ సుస్మిత, ఎంపీపీ మందా కవిత, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, పార్టీ నేతలు మోహన్‌నాయుడు, విజయభాస్కర్‌నాయుడు, కట్టంరెడ్డి విజయకుమార్‌రెడ్డి, రాచాల రవికుమార్‌యాదవ్, చీకుర్తి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.


వెంకటాచలం: ఆసరా సంబరాలకు హాజరైన మహిళలు

సోమశిలలో 53.942 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 53.942 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 354 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 1,200 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 403, దక్షిణకాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 97.024 మీటర్ల నీటి మట్టం నమోదైంది. సగటున 311 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వృథా అవుతోంది.

న్యూస్‌రీల్

డీసీఓగా సుధాభారతి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా సహకార శాఖ అధికారిగా (డీసీఓ) సుధాభారతిని నియమిస్తూ రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ప్రస్తుతం ఆమె నెల్లూరు డీఎల్‌సీఓగా పనిచేస్తున్నారు. డీసీఓగా పనిచేస్తున్న తిరుపాల్‌రెడ్డి స్థానంలో సుధాభారతిని నియమించారు.

జామాయిల్ చెట్లు దగ్ధం



గుడ్లూరు: అటవీ భూమిలో ఉన్న జామాయిల్ చెట్లు దగ్ధమైన ఘటన మండలంలోని జాతీయ రహదారిపై తెట్టు–శాంతినగర్ గ్రామాల మధ్య మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. జాతీయ రహదారి పక్కన అటవీ భూమిలో జామాయిల్ చెట్లు సాగులో ఉన్నాయి. రాత్రి 7 గంటల సమయంలో చెట్ల కింద ఉన్న ఎండు చెత్తకు నిప్పు అంటుకోవడంతో మంటలు చెలరేగాయి. 20 ఎకరాల్లో ఉన్న జామాయిల్ చెట్లకు మంటలు వ్యాపించగా శాంతినగర్ గ్రామస్తులు ఆర్పేందుకు ప్రయత్నించినా వీలు కాలేదు. దీంతో అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. రూ.లక్షల్లో నష్టం వాటిల్లి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఆకతాయిలు లేదా వాహనాలపై వెళ్తున్న వారు సిగరెట్లు తాగి పీకలు వేయడంతో మంటలు చెలరేగి ఉంటాయని భావిస్తున్నారు.

పింఛన్లు ఇచ్చి.. సంతోషాలు నింపుతూ..


నెల్లూరు: రమణమ్మకు నగదు అందజేస్తున్న వలంటీర్ రామకృష్ణ


నెల్లూరు: ఆస్పత్రిలో ఖాజా మొహిద్దీన్‌కు నగదు అందజేస్తున్న సచివాలయ సిబ్బంది రామచంద్ర

నెల్లూరు(పొగతోట): పింఛన్‌దారుల్లో ప్రభుత్వం సంతోషాలు నింపింది. వార్డు, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల వద్దకే వెళ్లి ఆప్యాయంగా పలకరించి మీ పింఛన్ తీస్కోండంటూ నగదు అందజేశారు. వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ప్రక్రియ జిల్లాలో వేగవంతంగా జరుగుతోంది. మంగళవారం నాటికి 2,20,213 మందికి నగదు ఇచ్చారు. దీంతో 71.63 శాతం నమోదైంది. కొందరు వలంటీర్లు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న లబ్ధిదారుల వద్దకు వెళ్లి డబ్బు అందజేశారు. ఈనెల 8వ తేదీ వరకు పింఛన్లు అందజేయనున్నారు.

హారన్ మోత

వాహనం ఎక్కగానే అవసరం ఉన్నా లేకున్నా కొందరు కొట్టే హారన్ మోతకు ఇతర వాహనదారుల గూబ గుయ్‌మంటోంది. ఈ మోత పర్యావరణానికి తూట్లు పొడుస్తోంది. హారన్ ద్వారా ఏకంగా 2 నుంచి 5 డెసిబుల్స్ శబ్ద కాలుష్యం పెరుగుతోందని నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(నీరి) చేసిన అధ్యయనంలో తేల్చింది. ఈ తీవ్రత పెరిగి అందరి ఆరోగ్యంపై మరింత ప్రభావం చూపకముందే ప్రజలు అప్రమత్తమై శబ్ద కాలుష్యం నివారణ వైపు అడుగులు వేయాలని పర్యావరణ వేత్తలు పేర్కొంటున్నారు.

- వాహనం ఎక్కితే తెగ హారన్ మోగిస్తున్న వాహనదారులు
- నగరంలో పెరుగుతున్న శబ్ద కాలుష్యం
- వాహనాల నుంచే 50 శాతం
- హారన్ కొడితే 2 నుంచి 5 డెసిబుల్స్ వరకు శబ్ద తీవ్రత
- ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- నీరి అధ్యయనంలో వెల్లడి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: శబ్ద కాలుష్యం నెల్లూరు నగరంలో రోజురోజుకూ పెరుగుతోంది. ఇటీవల నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(నీరి) చేసిన సర్వేలో ఎక్కువ వాహనాల రద్దీ ఉండే ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు శబ్ద తీవ్రత 8 పాయింట్లుగా నమోదైంది. ఒక్క నిమిషంలో వాహనదారులు ఎన్నిసార్లు హారన్ కొడుతున్నారో గుర్తించారు. వాహనాలే 50 శాతం శబ్ద కాలుష్యానికి కారణమని ఈ అధ్యయనంలో తేలింది. హారన్ మోగించడం వల్ల 2 నుంచి 5 డెసిబుల్స్ వరకు శబ్ద తీవ్రత నమోదవుతుందని తేలింది.



ఆర్టీసీ కూడలిలో వాహనాల రాకపోకలతో స్తంభించిన ట్రాఫిక్

చిరాకు, కోపం, ఆందోళన

శబ్ద కాలుష్యం చిరాకు, కోపం, ఆందోళనకు కారణమవుతోంది. ఈ శబ్ద కాలుష్యం ఆరోగ్యం, ప్రవర్తనపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ ధ్వనుల వల్ల మానసికంగా, దేహపరంగా ఆరోగ్యం దెబ్బతింటుందని తెలుస్తోంది. అలాగే వాహనాలు నడిపేటప్పుడు ఏకాగ్రత తగ్గి, రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

పెరుగుతున్న వాహనాలు

నెల్లూరు జనాభా 2004లో 4,04,775 మంది ఉండగా 2009వ సంవత్సరానికి 5,58,547 లక్షలకు చేరింది. ప్రస్తుతం దాదాపు 7 లక్షల పైచిలుకు జనాభా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అయితే నగరంలో పెరుగుతున్న జనాభాతోపాటు వాహనాల సంఖ్య కూడా నానాటికీ పెరుగుతోంది. గత నాలుగేళ్లలో ద్విచక్రవాహనాల సంఖ్య 1.42 లక్షలకు, కార్ల సంఖ్య 20 వేలకు పైగా, ఆటోల సంఖ్య 29,413 వరకు చేరింది. మొత్తమ్మీద నగర జనాభాలో సగభాగం వాహనాల సంఖ్యకు సమానమవుతోంది. ఇప్పుడున్న పరిస్థితి మున్ముందు కొనసాగితే ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతాయని తెలుస్తోంది. వాహనాలను రోడ్లపైకి రాకుండా అడ్డుకోలేని పరిస్థితి ఉండడంతో వాహనదారుల్లోనే మార్పు రావాల్సిఉంది. హారన్ పదేపదే కొట్టినంత మాత్రాన ట్రాఫిక్‌లో త్వరగా వెళ్లలేం. అవసరమైతేనే హారన్ మోగించాలి. మ్యూజిక్ హారన్లు, ఇతర హారన్ల వల్ల మరో 2 నుంచి 3 డెసిబుల్స్ శబ్ద తీవ్రత పెరుగుతోంది. వాహనదారులు శబ్ద కాలుష్యానికి కారణం కాకూడదని పర్యావరణ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిర్దేశిత 'శబ్ద' పరిమితులు (అంకెలు డెసిబుల్స్‌లో..)

విభాగం	పగలు	రాత్రి
నివాస ప్రాంతం	55	45
వాణిజ్య ప్రాంతం	65	55
పారిశ్రామిక ప్రాంతం	75	70
సున్నిత ప్రాంతం	50	40

శబ్ద కాలుష్యంతో అనర్థాలు



వాతావరణంలో రోజురోజుకూ శబ్ద కాలుష్యం ఎక్కువవుతోంది. మనిషి 15 డెసిబుల్స్ లోపల శబ్దాన్ని వినగలడు. 25 డెసిబుల్స్ వరకు కూడా మానవుని చెవి శబ్దాన్ని భరించగలదు. అంతకుమించితే చెవుడు వచ్చే అవకాశం ఉంది. పెద్ద శబ్దాలు చేసే హారన్‌లను, సైలెన్సర్లను, లౌడ్ స్పీకర్లను వినియోగించకూడదు.

– డాక్టర్ శ్రీదేవి, ఈఎన్‌టీ స్పెషలిస్ట్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, నెల్లూరు

తలనొప్పి, ఇరిటేషన్



దారిన పోయేటప్పుడు అకస్మాత్తుగా వినిపించే పెద్ద శబ్దాల వల్ల తలనొప్పి, ఇరిటేషన్ వస్తుంది. కొంతమంది ద్విచక్ర వాహనదారులు పెద్ద శబ్దాలు వచ్చే సైలెన్సర్లను వినియోగిస్తున్నారు. వీటి వల్ల ఉత్పత్తి అయ్యే శబ్దాలకు చెవులు మోతమోగిపోతున్నాయి. తద్వారా వచ్చే శబ్ద కాలుష్యాన్ని అరికట్టాలి. ఆర్టీఓ కార్యాలయ అధికారులు, పోలీసులు తగు చర్యలు చేపట్టాలి.

– దేవరకొండ శ్రీనివాసులు, ల్యాబ్ టెక్నీషియన్, బుజబుజనెల్లూరు

ఎస్‌జీఎస్‌కు నాక్ ఏ ప్లస్ గ్రేడ్



నాక్ ఏ ప్లస్ గ్రేడ్ సర్టిఫికెట్‌తో టీటీడీ ఈఓ, జేఈఓ తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీ గోవిందరాజ స్వామి (ఎస్‌జీఎస్) ఆర్ట్స్ కళాశాలకు నాక్-ఏ ప్లస్ గ్రేడ్ లభించింది. గతేడాది నవంబర్ 22, 23 తేదీల్లో నాక్ కమిటీ సభ్యుల బృందం కళాశాలను సందర్శించింది. బోధన, పరిశోధన, మౌలిక వసతులు, కళాశాల, గ్రంథాలయం, హాస్టల్ నిర్వహణ, మౌలిక సదుపాయాలు వంటి అన్ని అంశాలపై పరిశీలించి ఏ గ్రేడ్‌ను అందించింది. అయితే పునఃపరిశీలించాలని కళాశాల ప్రతినిధులు నాక్‌ను కోరగా గత నెల 30వ తేదీన 3.29 పాయింట్లతో ఏ ప్లస్ గ్రేడ్‌ను అందజేసింది. దీనికి సంబంధించిన సర్టిఫికెట్‌ను మంగళవారం టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి తన చాంబర్‌లో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వేణుగోపాల్‌రెడ్డికి అందజేశారు. నాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించడంలో కృషి చేసిన జేఈఓ సదాభార్గవి, డీఈఓ భాస్కర్ రెడ్డి, డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, కళాశాల నాక్ కో-ఆర్డినేటర్ పరమేశ్వర తదితరులను ఈఓ అభినందించారు. ఏడాది కాలంలోనే ఎస్వీడబ్ల్యూ డిగ్రీ, ఎస్వీ ఆర్ట్స్, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలకు నాక్ ఏ ప్లస్ గ్రేడు రావడం ఆయా కళాశాలల పనితీరుకు నిదర్శనమని తెలిపారు. ఇదే స్ఫూర్తితో టీటీడీ విద్యాసంస్థల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఈఓ పిలుపునిచ్చారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బుచ్చిరెడ్డిపాళెం: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన బుచ్చిరెడ్డిపాళెంలోని జొన్నవాడ సర్కిల్ వద్ద మంగళవారం వేకువజామున చోటుచేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం మేరకు బుచ్చిరెడ్డిపాళెంలో నివాసం ఉంటున్న శైలజ దంపతులు సోడా వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. స్థానిక కోదండరామస్వామి ఆలయ వార్షిక ఉత్సవాలు జరుగుతున్న క్రమంలో శైలజ దంపతులు ఆలయం వద్ద సోడాలు విక్రయించుకునేందుకు ఇంటికి తాళం వేసి వెళ్లారు. తిరిగి మంగళవారం వేకువజామున ఇంటికి రాగా తలుపు తీసి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూశారు. బీరువా తలుపులు తెరిచి ఉండగా అందులో ఉండాల్సిన 2 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.5 వేల నగదు అపహరించినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా సీఐ రామారావు, ఎస్సై వీరప్రతాప్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దుండగులు ఇంటి తాళాన్ని పగలగొట్టి ఇంట్లోకి చొరబడినట్లు బాధితులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

నెల్లూరు(టౌన్): వేసవి సెలవుల్లో జిల్లాలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో తరగతులు నిర్వహిస్తే ఇంటర్ బోర్డు నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని ఆర్ఐఓ వరప్రసాద రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రశాంతంగా జూనియర్ అసిస్టెంట్ పరీక్షలు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టులకు సంబంధించిన పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. కావలి విశ్వోదయ ఇంజినీరింగ్ కళాశాల, కోవూరు మండలం గంగవరం ఇంజినీరింగ్ కళాశాల, నెల్లూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం పేపర్-1, మధ్యాహ్నం పేపర్-2 పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు 360 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 59 మంది గైర్హాజరయ్యారు. కలెక్టరేట్ నుంచి డీఆర్వో వెంకటనారాయణమ్మ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు.

కేంద్ర ప్రభుత్వానిది రైతు వ్యతిరేక పాలన

- రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ



రైతు కూలీ సంఘం నేతల ప్రదర్శన

నెల్లూరు(బృందావనం): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక, నిరంకుశ పాలనను ప్రజాస్వామ్యవాదులు వ్యతిరేకించి ప్రజలను చైతన్యవంతులను చేయాలని రైతు కూలీ సంఘం(ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.ఝాన్సీ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న ఏనుగు సుందరరామిరెడ్డి ఆడిటోరియంలో మంగళవారం రైతు కూలీ సంఘం(ఆంధ్రప్రదేశ్) ఉమ్మడి నెల్లూరు జిల్లా మహాసభ ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు జి.సునీత అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ అనుసరిస్తున్న ఏకపక్ష, ప్రజా వ్యతిరేక విధానాలతో అటు రైతులు, ఇటు అన్నివర్గాల ప్రజలతోపాటు అన్ని రంగాలు సంక్షోభంలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెనక్కు తెస్తానని ప్రగల్భాలు పలికిన ప్రధాని నేడు దేశ సంపదను అదానీ, అంబానీ తదితర సామ్రాజ్యవాదులకు అప్పనంగా అప్పగిస్తున్నారని ధ్వజమెత్తారు. ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర కార్యదర్శి జాస్తి కిషోర్‌బాబు మాట్లాడుతూ వ్యవస్థలో మార్పు రావాలంటే భూమిహక్కు, సంపదలో ప్రజల భాగం పంచాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ(న్యూ) జిల్లా నాయకుడు ఎల్.లక్ష్మీరెడ్డి, ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం నాయకుడు సీహెచ్ ఓబయ్య, సండే మార్కెట్ కమిటీ నాయకుడు శరవణన్, స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కార్యదర్శి పి.కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నూతన కమిటీ ఏర్పాటు

మహాసభలో జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడిగా ఆర్.సుబ్బరాయుడు, ఉపాధ్యక్షుడిగా వి.రవీంద్ర, కార్యదర్శిగా జి.సునీత, సహాయ కార్యదర్శిగా వీవీ రమణయ్య, కోశాధికారిగా జి.కృష్ణారెడ్డి, మరో 8 మంది సభ్యులను ఎన్నుకున్నారు. తొలుత ట్రంక్‌రోడ్డు ఏసీ బొమ్మ వద్ద నుంచి గాంధీబొమ్మ, వీఆర్సీ సెంటర్, మద్రాస్ బస్టాండ్ మీదుగా ఆడిటోరియం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలపించిన అభ్యుదయ గీతాలు, ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి.

నగరపాలక సంస్థ, నెల్లూరు

ఆర్.ఓ.సి.నెం. 112/2020/ఎ1 — తేది.03.04.2023

బహిరంగ వేలము ప్రకటన


నెల్లూరు నగరపాలక సంస్థ ఆధీనములో ఉన్నటువంటి వివిధ మార్కెట్లు మరియు గంజిఖానాలకు సంబంధించి 2023-2024వ సంవత్సరమునకు (తే.01.04.2023 ది నుండి 31.03.2024 ది వరకు) బహిరంగ వేలము నగరపాలక సంస్థ కార్యాలయంలో తే.13.04.2023దిన ఉదయము 11 గంటలకు నిర్వహించబడును.

కావున సదరు బహిరంగ వేలములో పాల్గొనదలచిన పాటదారులు ఈ క్రింద కనపరచిన విధముగా పూర్తి వివరములు గెజిట్ నోటిఫికేషన్ నిబంధనల ప్రకారము వేలము పాట నందు పాల్గొనవచ్చును.

వరుస సంఖ్య	ప్రాంతము	కాల పరిమితి	డిపాజిట్	సాల్వెన్సీ
1	వైకస్ రోడ్డులోని గొర్రెల గంజిఖానా	1 సం॥	50,000	2,00,000
2	వైకస్ రోడ్డులోని పశువుల గంజిఖానా	1 సం॥	20,000	50,000
3	వైకస్ రోడ్డులోని చేపల మార్కెట్టు	1 సం॥	2,00,000	4,00,000
4	సంతపేటలోని పశువుల గంజిఖానా	1 సం॥	20,000	50,000
5	శెట్టిగుంట రోడ్డులోని చేపల మార్కెట్టు	1 సం॥	20,000	1,00,000
6	వైపాడు రోడ్డులోని చేపలు మరియు మటన్ మార్కెట్టు	1 సం॥	2,00,000	4,00,000

పై కనపరచిన మార్కెట్లకు సంబంధించి ఇతర వివరములకు కార్యాలయము పని వేళలో సంబంధిత రెవెన్యూ సూపరింటెండెంట్ గారికి గాని లేదా ఎ1 గుమాస్తా గారికి సంప్రదించి వివరములు సేకరించవలసినదిగా కోరడమైనది.

సం/- **డి.హరిత, ఐ.ఎ.యస్.,** కమీషనరు, నగరపాలక సంస్థ, నెల్లూరు



శ్రీ మల్లిఖార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానము

జొన్నవాడ క్షేత్రము, బుచ్చిరెడ్డిపాళెం(మం), శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఫోన్: 9491000734

సీల్డ్ టెండరు ప్రకటన

తేది:10.05.2023 నుండి తేది:20.05.2023 వరకు శ్రీ వార్ల వార్షిక బ్రహ్మోత్సవములు సందర్భముగా భక్తుల సౌకర్యార్థం కొరకు వివిధ ఏర్పాట్లు చేయుటకు దేవస్థానము నందు **తేది: 11.04.2023** మ॥ 12.00 లకు సీల్డ్ టెండర్లు నిర్వహించబడుచున్నవి.

నెం.	వివరములు	ధరావత్తు
1	డ్రామా స్టేజి నిర్మించుట	రూ. 25000/-
2	కళ్యాణము స్టేజి, క్లాత్ పందిరి ఏర్పాటు	రూ. 25000/-
3	షామియానా, కుర్చీలు, వంటపాత్రలు సరఫరా	రూ. 5000/-
4	రంగులు సున్నము వేయుట	రూ. 10000/-
5	బ్యారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాటు	రూ. 5000/-
6	విద్యుత్ దీపాలంకరణ, మైకుసెట్, జనరేటర్ ఏర్పాటు	రూ. 200000/-
7	ప్రాకార మండపం చుట్టూ క్లాత్ పందిర్లు	రూ. 10000/-
8	ఫ్లెక్సీలు ప్రింటింగ్ & కట్టుట	రూ. 5000/-
9	ఫోటో, వీడియో, ఎల్.ఇ.డి స్క్రీన్స్	రూ. 5000/-

గమనిక: 1 నుండి 9 వరకు గల ఐటమ్‌లకు టెండరు దాఖలు చేయు తేది: 11.04.2023 ఉ॥ 11:00 లోపు

షరతులు నెం.1 నుండి 9 వరకు సీల్డ్ టెండరులో తక్కువ మొత్తములను కోట్ చేయుదురో వారికి సదరు హక్కు ఖరారు చేయబడును. టెండరు షెడ్యూలు తేది: 11.04.2023 ఉ॥ 10.00 లోపు దేవస్థాన కార్యాలయము నందు రూ.1000/-లు చెల్లించి పొందవచ్చును. వివరములకు కార్యాలయము పనివేళల్లో / టెండరు తెరుచు సమయములో అడిగి తెలుసుకొనవచ్చును

పుట్టా లక్ష్మి సుబ్రహ్మణ్యం నాయుడు, ఛైర్మన్ మరియు ధర్మకర్తల మండలి — జె. వెంకట సుబ్బయ్య, సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి

తేది: 04.04.2023

లైబ్రరీలను నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా మార్చాలి

- వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి తదితరులు

వెంకటాచలం: లైబ్రరీలను నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా మార్చితే విద్యార్థినీ, విద్యార్థులకు చాలా ఉపయోగకరమని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి పేర్కొన్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్(ఐసీఎస్ఎస్ఆర్) సహకారంతో డిజిటల్ టెక్నాలజీ ద్వారా అకడమిక్ లైబ్రరీలను నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా మార్చడంపై ఈ నెల 19, 20 తేదీల్లో వీఎస్‌యూలో అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు సంబంధించిన కరపత్రాలను వీసీ మంగళవారం కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైబ్రరీలను నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా మారిస్తే కమ్యూనికేషన్, డిజిటల్, పరిశోధనా నైపుణ్యాలు, మానవ విలువలు, వృత్తిపరమైన నీతి, మేధో సంపత్తి హక్కులు పెంపొందించడానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ విజయానంద్‌కుమార్‌బాబు, గ్రంథాలయ అధికారిణి డాక్టర్ వై.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

దంపతులపై యాసిడ్ దాడి



యాసిడ్ దాడిలో గాయపడిన నాగార్జున

కలిగిరి: స్థానిక నటరాజ్‌తోట(లేఅవుట్) వద్ద ద్విచక్ర వాహనంపై వెళుతున్న దంపతులపై గుర్తుతెలియని వ్యక్తులు యాసిడ్‌తో దాడి చేసిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుల వివరాల మేరకు కలిగిరిలోని మెయిన్ రోడ్డులో వైఎస్సార్ విగ్రహం ఎదురుగా గుణపాటి నాగార్జున – రమ దంపతులు సెల్‌ఫోన్ దుకాణం నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి దుకాణం మూసి ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు. నటరాజ్‌తోట వద్ద చీకట్లో కాపుకాచి ఉన్న గుర్తుతెలియని వ్యక్తులు ఒక్కసారిగా వచ్చి ఇద్దరిపై యాసిడ్ పోసి పరారయ్యారు. యాసిడ్ దాడిలో తీవ్రంగా గాయపడిన నాగార్జున – రమలను కుటుంబసభ్యులు స్థానిక ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. దాడిలో ఇద్దరు వ్యక్తులు పాల్గొన్నట్లు అనుమానిస్తున్నారు. ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి వివరాలు సేకరిస్తున్నారు.

చోరీ కేసులో ముగ్గురికి రిమాండ్

వెంకటాచలం: చోరీ కేసులో కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తిరుగుతున్న ముగ్గురు నిందితులకు ఈ నెల 17వ తేదీ వరకు మేజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు సీఐ గంగాధర్‌రావు తెలిపారు. మండలంలోని గొలగమూడి రోడ్డు వద్ద 2020 సంవత్సరంలో జరిగిన ఓ చోరీ కేసులో కాకుటూరు గ్రామానికి చెందిన ముచమూరి రాజా, మల్లి విజయ్ బాబు, మల్లి పవన్‌కుమార్ నిందితులుగా ఉన్నారని, వీరు కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తిరుగుతున్నారని తెలిపారు. మంగళవారం నెల్లూరు నాలుగో అదనపు కోర్టులో ముగ్గురు నిందితులు హాజరుకాగా మేజిస్ట్రేట్ ఈ నెల 17వ తేదీ వరకు వారికి రిమాండ్ విధించినట్లు తెలిపారు.

చిన్నారి ఆచూకీ కోసం దర్యాప్తు వేగవంతం

నెల్లూరు సిటీ: కిడ్నాప్‌నకు గురైన ఏడాదిన్నర చిన్నారి ఆచూకీ కోసం పోలీసులు వేగవంతంగా దర్యాప్తు చేస్తున్నారు. బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 2వ తేదీన ఉయ్యాలలో నిద్రిస్తున్న చిన్నారిని గుర్తుతెలియని దుండగులు అపహరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబానికి దగ్గరి వ్యక్తులే కిడ్నాప్ చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. స్థానిక సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. చిన్నారి కిడ్నాప్‌నకు సంబంధించి పోలీసులకు క్లూస్ దొరికినట్లు సమాచారం.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

దుత్తలూరు: నిరుద్యోగ యువతీ యువకులకు సీడ్స్ స్వచ్ఛంద సంస్థలో ఈ నెల 15 నుంచి 45 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి వేణుగోపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ శిక్షణ, పోటీ పరీక్షల కోసం అర్థమేటిక్, రీజనింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, సోలార్, ఏసీ, ఎలక్ట్రికల్ రిపేరింగ్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. 10వ తరగతి పాసై 18–30 ఏళ్లలోపు ఆసక్తి ఉన్న యువతీ యువకులు ఈ నెల 12వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9908217465 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్ :	రూ.110
లేయర్ లైవ్ :	రూ.75
బ్రాయిలర్ చికెన్:	రూ.196
స్కిన్‌లెస్ చికెన్:	రూ.218
లేయర్ చికెన్:	రూ.128

నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.80
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.40